MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 284 | పేజీలు : 8 | శనివారం 3 అక్టోబర్ 2026 | వెల : 6-00

సిరుల సీమగా రాయలసీమ





- రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- ఉద్యాన రంగ అభివృద్ధితో రైతుల ఆదాయం పెంపే లక్ష్యం
- గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి అనుమతివ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రిలయన్స్ భాగస్వామ్యంతో భారతీయ వ్యవసాయ పాఠశాల ఏర్పాటుకు శంకుస్థాపన
- అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా ప్రకటించిన సీఎం చంద్రబాబు

మదనపల్లె, మహానగర్:

కరవు సీమగా పేరున్న రాయలసీమను సిరుల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, భారతీయ వ్యవసాయ పాఠశాల ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కార్యనిర్వాహక డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు సీఎం తెలిపారు. కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడులతో మరో రూ.60 వేల కోట్లు సమీకరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేసి, అదనంగా 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించడంతో పాటు రైతులకు ఉత్పత్తి నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు సమగ్ర మద్దతు అందిస్తామన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, మరో రూ.35 వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి అనుమతివ్వాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. రిలయన్స్ సహకారంతో ఏర్పాటయ్యే భారతీయ వ్యవసాయ పాఠశాల ద్వారా వ్యవసాయం, - మిగతా 2లో



తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు

- మండే ఎండల వేళ ఐఎండి గుడ్‌న్యూస్
- కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు
- అక్టోబర్ 4- 6 మధ్య భారీ వర్షాలకు అవకాశం
- తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటకలోనూ వానలు
- ఏపీ, రాయలసీమలో బలమైన ఈదురుగాలుల హెచ్చరిక

6లో

పరిశుభ్రత అలవాటుగా మారితేనే స్వర్ణాంధ్ర సాధ్యం

- నదుల్లో వ్యర్థాలు వదలొద్దు.. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత
- చెత్తను సంపదగా మార్చే విధానాలతో నెట్‌జీరో దిశగా ఏపీ
- ఐఐటీ కాన్పూర్‌తో నెట్‌జీరోపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఒప్పందం
- వచ్చే ఐదేళ్లలో గ్రామీణాభివృద్ధికి రూ.1.30 లక్షల కోట్లు
- స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు



విజయవాడ, మహానగర్

నదుల్లో వ్యర్థాలు, మురుగునీటిని వదలకుండా పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. స్వచ్ఛత ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఐదు కోట్ల మంది ప్రజలు ఉద్యమ స్ఫూర్తితో భాగస్వాములైతేనే శాశ్వత మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర అవార్డులు--2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని స్వచ్ఛతా వారియర్లు, స్వచ్ఛ గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, సంస్థలు, ప్రాంగణాలు, స్వచ్ఛంద సంస్థలకు పురస్కారాలు అందజేశారు. కృష్ణా, గోదావరి నదుల్లోకి వ్యర్థాలు, మురుగునీరు చేరడం వల్ల దిగువ ప్రాంతాల ప్రజలకు, పర్యావరణానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సీఎం తెలిపారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఆలోచనల్లోనూ స్వచ్ఛత ఉండాలని సూచించారు. చెత్తను సమస్యగా - మిగతా 2లో



జాతిపితకు ఘన నివాళి

- మహాత్మా గాంధీకి ప్రధాని మోదీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి నివాళి
- రాజ్‌ఘాట్‌లో బాపూజీకి అంజలి ఘటించిన ప్రధాని మోదీ
- నివాళులర్పించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా
- విజయ్‌ఘాట్‌లో శాస్త్రికి నివాళులర్పించిన ప్రధాని, ప్రముఖులు

6



కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

- 'సర్'లో తొలగించిన అర్హులను ఓటర్ జాబితాలో చేర్చాలని ఆదేశాలు
- దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా విపక్షాలు నిరసనలు
- దీంతో కీలక ప్రకటన చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- సర్ ప్రక్రియలో తొలగించిన అర్హులైన ఓటర్లను ఓటర్ జాబితాలో చేర్చాలని ఆదేశాలు జారీ



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే

- కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్
- ముంబయి శివాజీ పార్క్ కేంద్రంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- సీజేపీకి వ్యతిరేకంగా ముంబైలోనే జెన్ నెక్ట్స్ ముంబై బృందం కూడా ఆందోళనలు

6లో

స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో సత్తాచాతిన ఎన్టీఆర్ జిల్లా

- వివిధ కేటగిరీల్లో అత్యధిక పురస్కారాలతో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు
- స్వచ్ఛత, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుకు దక్కిన గౌరవం
- ముఖ్యమంత్రి చేతుల మీదుగా అధికారులతో కలిసి అవార్డులు అందుకున్న జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్టీఆర్ జిల్లా సత్తా చాటింది. వివిధ విభాగాల్లో సమర్థవంతంగా చేపట్టిన స్వచ్ఛత, పారిశుద్ధ్య కార్యక్రమాలకు గుర్తింపుగా జిల్లాకు మొత్తం 8 రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించాయి. నగరంలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణ, ప్రజల్లో అవగాహన కల్పించడం, స్థానిక సంస్థల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం వంటి కార్యక్రమాలకు ఈ పురస్కారాలు గుర్తింపుగా నిలిచాయి. జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన చర్యలు ఈ విజయానికి దోహదపడ్డాయి. స్వచ్ఛ మున్సిపాలిటీ కేటగిరీలో విజయవాడ నగరపాలక సంస్థ, స్వచ్ఛ గ్రామ పంచాయతీ విభాగంలో మున్నలూరు గ్రామపంచాయతీ పురస్కారాలు సాధించాయి. స్వచ్ఛ ఆసుపత్రుల కేటగిరీలో కొనకంచి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవార్డులు పొందాయి. స్వచ్ఛ రైతు బజారు విభాగంలో పాయకాపురం రైతు బజార్‌కు, స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ కేటగిరీలో మైలవరం గ్రామపంచాయతీకి చెందిన యు. సంధ్యకు పురస్కారాలు లభించాయి. స్వచ్ఛత ఎన్జీవో కేటగిరీలో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్, స్వచ్ఛ ఆలయాల కేటగిరీలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం అవార్డులు అందుకున్నాయి. జిల్లాకు 8 పురస్కారాలు లభించడం పట్ల జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలని సూచించారు.

సిరుల సీమగా రాయలసీమ

-మొదటిపేజీ తరువాయి

ఉద్యానవనం, ఆధునిక సాంకేతికత, పరిశోధన, కృత్రిమ మేధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందిస్తున్న సహకారాన్ని సీఎం ప్రస్తావించారు. అనంత్ అంబానీ తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని కోరగా, ఆయనను రాష్ట్ర ముద్దుబిడ్డగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. కార్యక్రమం అనంతరం ప్రముఖులు మొక్కలు నాటి, ఉద్యాన రంగానికి సంబంధించిన ప్రదర్శనలను సందర్శించారు.

పరిశుభ్రత అలవాటుగా మారితేనే స్వర్ణాంధ్ర సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

కాకుండా సంపదగా మార్చే విధానాలతో వ్యర్థాల నుంచి విద్యుత్తు, ఎరువులు, బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తూ సర్కులర్ ఎకానమీ దిశగా రాష్ట్రాన్ని తీసుకెళు ్నామని చెప్పారు. నెట్‌జీరో విధానాలపై అధ్యయనం కోసం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఐఐటీ కాన్పూర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.1.30 లక్షల కోట్ల ఖర్చు చేయాలని ప్రణాళిక రూపొందించామని చెప్పారు. రాయలసీమను రూ.లక్ష కోట్ల పెట్టుబడితో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రతను ప్రజల జీవితంలో భాగం చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలి

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సమానత్వం, స్వచ్ఛత వంటి ఉన్నతమైన ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత బలోపేతం అవుతాయని అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శు క్రవారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన అపూర్వ సేవలను, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. భారతదేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీ అనుసరించిన సత్యాగ్రహం, అహింసా మార్గాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో చైతన్యం నింపడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని అన్నారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, స్వచ్ఛత, సామాజిక సమానత్వం, మానవతా విలువలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విలువలను చిన్ననాటి నుంచే పిల్లలకు, యువతకు పరిచయం చేసి, వాటిని ఆచరణలో పెట్టేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా జీవనంలో నిజాయితీ, బాధ్యత, క్రమశిక్షణ, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల గౌరవం, సహనం, మానవతా దృక్పథంతో వ్యవహరించడం ద్వారా గాంధీజీ కలలుగన్న సమాజ నిర్మాణానికి దోహదపడగలరని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, ప్రజా ప్రదేశాల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. గాంధీజీ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను సానుభూతితో, బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గాంధీజీ సత్యం, అహింస మార్గాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

ఆర్థిక ప్రయోజనాల కోసం చేయని నేరాలను నెత్తికెత్తుకోవద్దు

జైలు జీవితాన్ని సత్ప్రవర్తన అలవర్చుకునే అవకాశంగా మార్చుకోవాలి

ఖైదీలకు హితవు పలికిన అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం. సునీల్ కుమార్



విజయవాడ, మహానగర్

మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని విజయవాడ జిల్లా కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం. సునీల్ కుమార్ హాజరయ్యారు. తొలుత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నిర్వహించిన సభలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలలో నిజమైన పరివర్తన రావాలంటే గాంధీజీ బోధించిన సత్యం, అహింస సిద్ధాంతాలను జీవితంలో ఆచరించాలని సూచించారు. చట్టవ్యతిరేక మార్గాలకు దూరంగా ఉంటూ, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతరులు చేసిన నేరాలను తమపై వేసుకోవద్దని హితవు పలికారు. జైలు జీవితాన్ని సత్ప్రవర్తన అలవర్చుకునే అవకాశంగా మార్చుకుని, జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకుంటూ పరిపూర్ణ వ్యక్తులుగా సమాజంలోకి తిరిగి అడుగుపెట్టాలని సూచించారు. అనంతరం కారాగార ప్రాంగణాన్ని సందర్శించిన న్యాయమూర్తి ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కారాగార పర్యవేక్షణాధికారి మహమ్మద్ ఇర్ఫాన్ న్యాయమూర్తిని సత్కరించారు. ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వివిధ క్రీడలు, వ్యాసరచన తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఖైదీలకు న్యాయమూర్తి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, జిల్లా కారాగార వైద్యాధికారి రోషన్ మియాన్, జైలర్లు ఎన్. గణేష్, సి.హెచ్. వేణు, డిప్యూటీ జైలర్ బి. గోపయ్య నాయక్, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లికి రాష్ట్ర, జిల్లా ఉత్తమ స్వచ్ఛ అవార్డులు

ఉత్తమ ఈఓగా మాధవేంద్రరావుకు అవార్డు



చల్లపల్లి, మహానగర్

గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ఉత్తమ స్వచ్ఛ అవార్డులు లభించాయి. శుక్రవారం రాష్ట్ర రాజధానిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతులమీదుగా పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్--2026 అవార్డు అందుకున్నారు. అనంతరం మచిలీపట్టణం జడ్పీ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతులమీదుగా జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్--2026 అవార్డు అందుకున్నారు. గ్రామ స్వచ్ఛతకు శ్రమిస్తున్న మాధవేంద్రరావును రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, స్వచ్ఛ ఏపీ డైరెక్టర్ బోలెం నాగమణి అభినందించారు.

మోపిదేవి దేవస్థానానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



మోపిదేవి, మహానగర్

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం జిల్లా ఉత్తమ స్వచ్ఛ ఆంధ్ర అవార్డు-2026 అందుకుంది. శుక్రవారం మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఈ అవార్డు అందుకున్నారు. భక్తులకు విశేష సౌకర్యాలు అందిస్తూ ఆలయ పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావును రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, సత్య ఆంధ్ర డైరెక్టర్ బోలెం నాగమణి అభినందించారు.

రాష్ట్రంలో హాకీ అభివృద్ధికి కృషి

హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బి.ఎం.చాణక్య రాజు

హాకీ ఆంధ్రప్రదేశ్ 33వ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం



విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

హాకీ ఆంధ్రప్రదేశ్ 33వ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం నగరంలోని గవర్నర్‌పేటలోని ప్రకాశం రోడ్డులో ఉన్న హోటల్ ఆర్ గ్రాండ్‌లో శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో హాకీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణ, వివిధ స్థాయిల్లో పోటీల నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, హాకీని మరింత విస్తరించడం, రాబోయే పోటీలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై కార్యవర్గ సభ్యులు చర్చించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగేవరకు కె. భవాని శంకర్ ను నూతన కార్యదర్శిగా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. సమావేశానికి హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బి.ఎం. చాణక్య రాజు అధ్యక్షత వహించారు. అసోసియేట్ అధ్యక్షుడు జి. సతీష్, ఉపాధ్యక్షుడు సూర్య ప్రకాశ్, కోశాధికారి ఎ. సుందర్ రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి రామకృష్ణతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కె. రాజశేఖర్, భారత్, శ్యామల, రిషిక లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, స్వచ్ఛత మహాత్మా గాంధీ నినాదాలు

గాంధీ క్షేత్రంలో ఘనంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

అవనిగడ్డ, మహానగర్



గ్రామాల అభివృద్ధి, స్వచ్ఛతా కాంక్షతోనే దేశాభివృద్ధి సాధ్యమని మహాత్మాగాంధీ నినదించారని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ క్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీ విగ్రహాలకు, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి వెంకట్రామ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీ క్షేత్రం ఆవరణలోని జాతీయ నాయకుల విగ్రహాలకు గాంధీ క్షేత్రం సభ్యులు, గ్రామీణ యువజన వికాస సమితి సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాధినేతలకు సైతం మహాత్మా గాంధీ ఆదర్శాలు అనుసరణీయంగా నిలిచాయన్నారు. అహింసతో స్వతంత్రం సాధించిన మహాత్మా గాంధీ ఆలోచనలు సేవలు జీవిత చరిత్ర నేటి తరం తెలుసుకొని అనుసరించాలని కోరారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు 1969లో మండలి వెంకట కృష్ణారావు గాంధీ క్షేత్రం స్థాపించి గాంధేయవాదిగా ప్రజలకు సేవ చేశారన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి జీవితం ఆదర్శనీయంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ అడపా శ్రీను, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీహరి, లంకమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ అన్నపరెడ్డి రామదాసు, సొసైటీ చైర్మన్లు యలవర్తి చిన్నా, యర్రంశెట్టి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ బొప్పన భాను, మాజీ సర్పంచ్ అంబటి శ్యాంప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, జనసేన పార్టీ నాయకులు బచ్చు వెంకట నారాయణ, గుడివాక శివరావు, కమ్మిలి మారిబాబు, తుంగల నరేష్, గుడివాక రామాంజనేయులు, కమ్మిలి సాయి భార్గవ, పప్పుశెట్టి శ్రీను, గుడివాక రాము, యలవర్తి ఆది, మండలి బలరాం, నున్న సుబ్బారావు, బాలకృష్ణ, పద్మాయ్, నారేపాలెం శంకరరావు, ప్రభుత్వ కళాశాల వసతి గృహం విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



చల్లపల్లి, మహానగర్

నిరాడంబరతే నిజమైన సంపద అని మహాత్మా గాంధీ సందేశం ఇచ్చారని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలోని మహాత్మా గాంధీ స్మృతి వనంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి మండలి వెంకట్రామ్ పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస, నిరాడంబరత, స్వావలంబన, సేవ, నైతికత మహాత్ముడి జీవన దృక్పథానికి పునాదులు అన్నారు. వస్త్రధారణ నుంచి ఆహారం వరకు గాంధీజీ జీవితం అత్యంత సరళంగా ఉండేదన్నారు. కేవలం ఒక స్వాతంత్ర్య సమర యోధుడిగానే కాకుండా, ఒక ప్రత్యామ్నాయ జీవన విధానాన్ని చూపిన మహనీయుడిగా మహాత్మా గాంధీ స్ఫూర్తినిస్తారన్నారు. నేటి వినియోగ సంస్కృతిలో గాంధేయ నిరాడంబరత మనకు విలువైన సందేశాన్ని ఇస్తుందన్నారు. ఎక్కువగా కలిగి ఉండటంలో కాదు, అవసరమైనంతలో సంతృప్తిగా జీవించడంలోనే నిజమైన సంపద ఉందని గాంధీజీ సందేశం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 8 నుంచి అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

విజయవాడ

ఈ నెల 8వ తేదీ నుంచి అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ నుంచి ప్రారంభం కానుంది. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, బ్యూటీ, హోమ్, కిచెన్, రోజువారీ అవసరాలు సహా పలు విభాగాల్లో ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయని అమేజాన్ ఇండియా తెలిపింది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డ్ ఈఎంఐలతో 10 శాతం తక్షణ డిస్కౌంట్ పొందవచ్చని, అమేజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుతో ప్రైమ్ సభ్యులు అపరిమితంగా 5 శాతం క్యాష్‌బ్యాక్ పొందవచ్చని పేర్కొంది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌పై 80 శాతం వరకు, ఫ్యాషన్, బ్యూటీ బ్రాండ్లపై 80 శాతం వరకు తగ్గింపు ఉంటుందని తెలిపింది. అమెజాన్ బజార్‌లో కోట్లాది ఉత్పత్తులపై 70 శాతం వరకు తగ్గింపు, పుస్తకాలపై 70 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తుందని వెల్లడించింది. ప్రయాణాల కోసం అమేజాన్ పే ద్వారా విమాన బుకింగ్స్‌పై 23 శాతం వరకు, హోటళ్లపై 75 శాతం, బస్సు బుకింగ్స్‌పై 17 శాతం వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపింది. ఏఐ ఆధారిత రూఫస్, లెన్స్ వంటి సాధనాలతో ఉత్పత్తుల అన్వేషణ, ధరల చరిత్ర, సమీక్షలు, వ్యక్తిగత సిఫారసులు పొందవచ్చని పేర్కొంది. అమేజాన్ నౌ ద్వారా 120కి పైగా నగరాల్లో వేలాది ఉత్పత్తులను నిమిషాల్లోనే డెలివరీ చేయనున్నట్లు తెలిపింది.

వన్ ట్రాఫిక్ ఏసీపీగా పల్లపురాజు



విజయవాడ క్రైమ్, మహానగర్

జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబును నూతన వన్ ట్రాఫిక్ ఏసీపీ పల్లపు రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా మంగళగిరి హెడ్‌క్వార్టర్స్‌లో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న పల్లపు రాజును ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో వన్ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వన్ ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పల్లపు రాజు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి ఎస్.వి. రాజశేఖర బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు మొక్కను అందజేశారు.

గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక గ్రామసభలు

స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్రపై ప్రజలకు అవగాహన

తడి, పొడి చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచన



ఆగిరిపల్లి, మహానగర్

గాంధీ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. గ్రామసభల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాలు, స్వచ్ఛ రథంపై అవగాహన, దసరా కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ప్రజలకు సూచించారు. ఈదులగూడెం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పీ4 కార్యక్రమం తదితర అంశాలను వివరించారు. అనంతరం నీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తామని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి



విజయవాడ, మహానగర్

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌తో పాటు కూటమి నేతలు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అలుగుండ్ల సుబ్బారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ దుర్బేసుల హుస్సేన్, శ్రీ దినవాహి వారి సత్రం పాలకమండలి చైర్మన్ పైలా నరసింహారావు, పాలకమండలి సభ్యులు పోతిన జ్యోతి, జీ.పీ. నాయుడు, లక్ష్మీ ప్రసన్న, డూండీ సాయి శ్రీనివాస్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ, శాస్త్రి ఆశయాలు నేటి సమాజానికి ఆదర్శం

ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు

సత్యం, అహింస, నిజాయితీ, క్రమశిక్షణ విలువలను ఆచరించాలి



విజయవాడ, మహానగర్

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయం లో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు, వారు పాటించిన విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. సత్యం, అహింస, నైతిక విలువలను గాంధీజీ జీవితంలో ఆచరించి ప్రజలకు మార్గదర్శకంగా నిలిచారని పేర్కొన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి సరళత, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని, దేశం పట్ల బాధ్యత, ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేసిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మహనీయులు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీ, శాస్త్రి ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, దుర్గగుడి డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కరీముల్లా, కాకు మల్లికార్జున్, ఎర్నేని వేదవ్యాస్, రాయల సుబ్బారావు, జగన్, కోనేరు కిషోర్, కిలారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జెన్ జీ నొప్పులకు జండు బామ్ కొత్త ప్రచారం



ముంబై

ఆధునిక జీవనశైలిలో యువత ఎదుర్కొంటున్న మెడనొప్పి, తలనొప్పి, నిరంతరం స్క్రీన్‌లను చూడటం, డూమ్‌స్క్రోలింగ్ వల్ల కలిగే అలసట వంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇమామి లిమిటెడ్‌కు చెందిన జండు బామ్ 'అన్నూ విత్ జండూ' పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. జెన్ జీ వినియోగదారులతో వారికి నచ్చే భాష, హాస్యం, సమకాలీన అంశాల ద్వారా అనుసంధానం కావడమే ఈ ప్రచారం లక్ష్యమని సంస్థ తెలిపింది. ఆధునిక జీవితంలోని నొప్పులు, రోజువారీ ఇబ్బందులతో యువత ఎదుర్కొనే పరిస్థితులను 'పెయిన్‌ల్యాండ్' అనే ఊహాజనిత ప్రపంచం ద్వారా ప్రచారంలో చూపించారు. ఇలాంటి సమస్యలకు జండు బామ్‌ను ఉపశమన పరిష్కారంగా పరిచయం చేశారు. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, సాధారణ జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనానికి దశాబ్దాలుగా వినియోగంలో ఉన్న జండు బామ్, మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త తరంతో మరింతగా అనుసంధానం కావడంపై దృష్టి సారించిందని పేర్కొంది. 16 నుంచి 28 ఏళ్ల వయసు వారిని ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్న ఈ ప్రచారాన్ని ట్రీ కమ్యూనికేషన్స్, అబ్బాస్ మిర్జా రూపొందించారు. టెలివిజన్, డిజిటల్, ఓటీటీ, సామాజిక మాధ్యమాల ద్వారా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ–ఎన్‌సీఆర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

హీల్ పాఠశాలకు జాతీయ స్థాయి అవార్డు

దేశవ్యాప్తంగా 33,163 సీబీఎస్ఈ పాఠశాలల్లో హీల్‌కు గుర్తింపు

నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతులు

పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో వంద శాతం ఫలితాలు



ఆగిరిపల్లి, మహానగర్

దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న 33,163 సీబీఎస్ఈ పాఠశాలల్లో ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ పాఠశాల జాతీయ స్థాయిలో రెండో అత్యుత్తమ ధాతృత్వ పాఠశాలగా గుర్తింపు పొందిందని హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ తెలిపారు. ఢిల్లీలోని ద్వారకా సెంటర్‌లో గతవారం నిర్వహించిన జాతీయ సీబీఎస్ఈ అవార్డుల ప్రదానోత్సవంలో బ్రెయిన్‌ఫెడ్ సంస్థ వ్యవస్థాపకుడు కె.వి. బ్రహ్మం చేతుల మీదుగా హీల్ అకడమిక్ డైరెక్టర్ యు. మణికుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఎం. హరీశ్ అవార్డును అందుకున్నారని చెప్పారు. వేలాది మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పించడంతో పాటు సీబీఎస్ఈ పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధిస్తున్న సంస్థగా హీల్ పాఠశాల నిలిచిందన్నారు. ఈ సందర్భంగా హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, బోర్డు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ ఎం. కవిత ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. పాఠశాలకు ఆర్థిక సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహానగర్

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అమెరికా వెళ్లాలి.. డాలర్ డ్రీమ్స్ నెరవేర్చుకోవాలి' అని భారత్‌లోని సగటు యువతలో చాలామంది ఆశపడుతూ ఉంటారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ అక్కడి విదేశీ విద్యార్థులు, యువత ఆశలపై నీళ్లు చల్లడం ప్రారంభించారు.ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో ఓ.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి.ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఓ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది.ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై దృష్టి పెడుతున్నారు.క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు.కానీ ఇక్కడా సవాళ్లు తప్పడం లేదు!విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి.ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది.క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి.దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది.ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు.ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు.అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది.హెచ్-1బీ వీసా చార్జీలు అనూహ్యంగా పెంచడమే కాక, విద్యార్థి వీసాలపై వచ్చే వారిపై కఠిన నిబంధనలు విధించారు. దీంతో అక్కడ ఉంటున్న ఇండియన్స్ సహా ఇతర దేశస్థులకు ఉద్యోగ అవకాశాలు తగ్గడమే కాక, ఆ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది.హెచ్-1బీ వీసా కింద నియామకాలు తగ్గించి స్థానికులనే నియమించుకోవడం మెల్లిగా ప్రారంభించాయి. డాలర్ల సంపాదన లక్ష్యానికి ట్రంప్ దెబ్బకొట్టడంతో అమెరికాకు వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. పోనీ ఎలాగోలా వెళ్దామని దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. వీసాల తిరస్కరణ డాటాను పరిశీలిస్తే.. ప్రాంతాల వారీగా వాటిలో అసమానతలు పెరుగుతున్నాయన్న విషయం వెల్లడవుతున్నది. దీనివల్ల అమెరికాలో విద్యావకాశాలు యోగ్యత, ప్రతిభ కంటే భౌగోళిక పరిస్థితుల వల్లే ఎక్కువగా ప్రభావితమవుతున్నాయా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.అమెరికా విద్యావకాశాల విషయంలో ప్రాంతీయఅంతరం పెరుగుతున్నదని ఒక నివేదిక వెల్లడించింది. భారత దేశం సహా పాకిస్థాన్, నేపాల్, ఫిలిప్పీన్స్, కెన్యా, బ్రెజిల్, మెక్సికో, వియత్నాం, అర్జెంటీనా లాంటి గ్లోబల్ సౌత్ దేశాల నుంచి వచ్చే విద్యార్థి వీసా దరఖాస్తుదారులు, యూరప్, ఉత్తర అమెరికా నుంచి వచ్చే వారితో పోలిస్తే అధిక తిరస్కరణను ఎదుర్కొంటున్నారు.భారత స్టూడెంట్ల వీసా తిరస్కరణ ఇలా2023-36%, 2024-53%, 2025-61% 2025 ఫిబ్రవరి నాటికి అమెరికాలో 3,78,787 మంది మన విద్యార్థులు ఉండగా, 2026 ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 3,52,644కు తగ్గిపోయింది.మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి. విదేశీ విద్య కోసం భారీ రిస్క్ తీసుకోవడం కంటే.. ముందుగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవడానికే కొత్త తరం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.

ఎల్‌నినో ప్రభావం వల్ల కురవని వర్షాలు

వ్యవసాయ రంగానికి సవాల్



ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై గట్టిగానే కనబడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఫలితంగా రైతుల్లో దిగులు పెరుగుతోంది. మామూలుగా అయితే ఈ సీజన్‌లో 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. కానీ జూన్ 1 నుంచి ఇప్పటి వరకూ చూస్తే కాస్త అటు ఇటుగా 536.5 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదైంది. ఈ సెప్టెంబరులో మైనస్ 31 శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది.

సగటున చూస్తే రాష్ట్రవ్యాప్తంగా మైనస్ 21 శాతంపైగా లోటు వర్షపాతం కనిపిస్తుండటం కలవర పెడుతోంది. అసలు సీజన్ మొదట్లోనే నాసిరకం విత్తనాలతో ఇబ్బందులుపడ్డారు రైతులు. ఆ తరవాత సమయానికి రుణాలు అందకపోవడం, వర్షాభావ పరిస్థితులు సేద్యాన్ని ముందుకు సాగనివ్వలేదు. ఆదిలాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, వనపర్తి సహా మొత్తం 18 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 9 జిల్లాల్లో మాత్రమే 100% ఆయకట్టు పూర్తై పంటలు సాగవుతున్నాయి.

గతేడాదితో పోలిస్తే 6 శాతం సాగు తగ్గింది

మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం వంటి ఉమ్మడి జిల్లాల్లో ఈ సీజన్‌లో ఒక ఊరిలో వర్షం కురిస్తే పక్క గ్రామంలో చినుకే పడలేదు. మరికొన్ని చోట్ల కుండపోత కురిసింది. ఈ నెలాఖరుతో ఖరీఫ్ సీజన్ ముగియనుంది. ఈ తరుణంలో ఎల్‌నినో ప్రతికూలత ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం రూ.1.32 కోట్లకు పైగా ఎకరాలుగా నిర్దేశించింది ప్రభుత్వం. కానీ వాతావరణ పరిస్థితులతో 1.24 కోటి ఎకరాలకే ఇది పరిమిత మైంది. గత ఏడాది వానాకాలంతో పోలిస్తే ఈ సీజన్‌లో 6% విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రధాన ఆహార పంట వరి తీసుకుంటే సాధారణ సాగు విస్తీర్ణం 65,95,645 ఎకరాలు ఉండగా 55,89,862 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. సానుకూల పరిస్థితులు ఈ తాజా వానా కాలంలో లేకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. పత్తి, మొక్కజొన్న పరిస్థితీ ఇంతే. ఇక జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామలు వంటి చిరుధాన్యాల పంటలు కాస్త ఆశాజనకంగా ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని మే, జూన్? నుంచి చెబుతున్నాం. అయినప్పటికీ జూన్?లో వర్షాలు పడకపోయేసరికి కొందరు రైతులు విత్తనాలు వేయలేదు. మరికొందరు రిస్క్? తీసుకొని వేశారు. వర్షాలు పడక పత్తి, మొక్కజొన్న పంట సగం కూడా చేతికి రాలేదు. కొందరు మాత్రం 5 ఎకరాల్లో పంటను వేద్దామనుకుంటే వాన కురుస్తున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఒక ఎకరం, ఆ తర్వాత మరో ఎకరం అలా పంటలు వేశారు – అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ముల్కనూర్ కో-ఆపరేటివ్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్

నూనెగింజల పంటల సాగు పరిస్థితి ఇలా

ఇక నూనెగింజల పంటల సాగు కూడా చాలా నిరుత్సాహంగా సాగుతోంది. వ్యవసాయ శాఖ, యూనివర్సిటీ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో ఎంత అవగాహన కల్పించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. సూపర్ ఎల్‌నినో ప్రభావం పుణ్యమాని వాతావరణ సమతుల్యత తీవ్రంగా దెబ్బతింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న నీటి వనరులను అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఓ పంట కాలంలో కురిసే వర్షపు నీటిని సంరక్షించుకోవాలన్నది సాగు రంగ నిపుణులు చెబుతున్న సూచన.

కురిసిన వర్షాలతో కాస్తంత భర్తీ అయిన లోటు

ఈ ఆందోళనల మధ్య కాస్త ఊరట ఏంటంటే ఇటీవలి వాయుగుండం. ఉత్తర తెలంగాణలో ఈ వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు కురిశాయి. మంచిర్యాల, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్ సహా మరి కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షాభావ పరిస్థితులతో అసలు పంటలు చేతికి అందుతాయా లేదా అన్న ఆందోళనలో ఉన్న రైతులకు ఇది కాస్త ఊరటనిచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అతి పెద్ద వర్షం అని అంటున్నారు అన్నదాతలు. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ లెక్కల ప్రకారం జూన్ నుంచి సెప్టెంబర్ 24వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా 60 రోజుల పాటు వాన కురిసింది. ఇప్పటికే లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో ఇప్పుడు కురిసిన వర్షాలతో కొంత లోటు భర్తీ అయ్యే అవకాశముంది.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

ఎల్‌నినో ప్రభావంపై ఖరీఫ్ సీజన్ ఆరంభం కంటే ముందే ప్రభుత్వం అప్రమత్తమైంది. అటు ఐసీఏఆర్, వ్యవసాయ వర్సిటీ కూడా రైతులకు సూచనలు చేసింది. కానీ ఎంత అవగాహన కల్పించినా ఆశించిన ఫలితం రాలేదు. నీరు ఎక్కువ అవసరమైన వరిసాగు వైపు మళ్లొద్దని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. అయినా రకరకాల కారణాలతో రైతులు వరి నాట్లు వేసుకున్నారు. ఇప్పుడు మంచి పొట్ట దశలో పంటలకు సరైన నీరు అందడం లేదు. చీడ పీడలు, తెగుళ్ల ప్రభావంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితుల్లో ధాన్యం ఉత్పత్తి తగ్గిపోయే సూచనలు కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పైగా రానురాను ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమవుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్?లో 10 లక్షల ఎకరాలు పైగా విస్తీర్ణంలో వరి పంట సాగు తగ్గిపోయింది. ఆ స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు మళ్లారు. కొందరు ఇంకా వేచి చూసే ధోరణిలో వర్షం రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఇక ఆశించిన స్థాయిలో వర్షాలు పడే సూచనలు కనిపించడం లేదు. రాబోయే రబీ సీజన్ కోసం కసరత్తు మొదలైంది. భూగర్భ జలాలు పడిపోతున్నాయి. విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇలాంటి సమయంలో మళ్లీ రైతులంతా వరిపంట వైపు మళ్లితే ఇబ్బందులు తప్పవు. అందుకే వ్యవసాయ శాస్త్రవేత్తలు మరోసారి అప్రమత్తం చేస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితులు 2026 చివరి నాటికి మరింత బలపడి 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే 11-12 నెలలపాటు తాగునీటి కోసం అధిక ప్రాధాన్యమిచ్చి ఎత్తిపోతల పథకాల ద్వారా రిజర్వాయర్లు, చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టాలని చూస్తోంది ప్రభుత్వం. అనిశ్చిత వర్షపాతం, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు దృష్ట్యా ప్రత్యేక "ఎల్‌నినో అసిస్టెన్స్ ఫండ్" ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మరి ముందు ముందు పరిస్థితులు ఇంకెలా ఉంటాయి? ప్రభుత్వం ప్రణాళికలు ఎలా ఉండనున్నాయి? అన్నది చూడాలి.

మళ్లీ ఉన్మాద ఛాయలు!



కొన్ని హఠాత్సంఘటనలు అరుదైన వ్యక్తులనూ, మనుషుల్లోని అసాధారణతనూ ప్రపంచం ముందు ఆవిష్కరిస్తాయి. బుధవారం ఒక దుండగుడి హైజాక్ యత్నంలో చిక్కుబడి, ప్రమాదపుటంచుల్లోపడిన ఫ్లై దుబాయ్ విమానం తిరిగి నిలదొక్కుకున్న ఉదంతంలో ఆ విమానం పైలెట్ కెప్టెన్ స్మిత్ మచ్ఛర్ పేరు ఇప్పుడు ప్రపంచం మూలమూలనా మార్మోగటానికి ఆయన ప్రదర్శించిన తెగువ, సాహసాలే కారణం. కో కెప్టెన్ దాడితో శరీరంనిండా కత్తిపోట్లున్నా, నెత్తురోడుతూ అపస్మారకంలోకి పోతున్నా కెప్టెన్ మచ్ఛర్ ఏమాత్రం జంకక సమయస్ఫూర్తితో, విమానాన్ని రక్షించి తీరాలన్న పట్టుదలతో కాక్‌పిట్ తలుపు లాక్ తెరవడం చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే సన్నివేశం. ఆయన స్ఫూర్తిదాయక వ్యవహారశైలి దేశదేశాల్లోని పైలెట్లకు, మొత్తం విమానయాన సిబ్బందికి భవిష్యత్తులో ఒక అధ్యయనాంశంగా మారుతుంది. సరిగ్గా పాతికేళ్లనాడు అమెరికాలో నాలుగు విమానాల్ని దారిమళ్లించి కూల్చివేసి, వేలాదిమంది మరణానికి కారణమైన ఉగ్రవాద ఉన్మాదంనుంచి ప్రపంచ దేశాలింకా సరైన గుణపాఠం నేర్చుకోలేదని ఈ హైజాక్ యత్నం రుజువుచేసింది. అది ఆత్మాహుతి దాడా... మరేదైనానా అన్నది తేల్చాల్సివున్నదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో సహా పలువురు చెబుతున్నా, దీనివెనక ఇరాన్ హస్తమున్నదని బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ ఆరోపిస్తున్నారు. ఈ దుండగానికి కారకుడైన కో పైలెట్ ఒమన్ జాతీయుడు. 174 మంది ప్రయాణిస్తున్న ఆ విమానం ఎన్నో అవాంతరాలెదురైనా చివరకు సురక్షితంగా సౌదీ అరేబియాలో అడుగుపెట్టింది. కెప్టెన్ మచ్ఛర్‌పై కో పైలెట్ దాడి,వారి పెనుగులాట... అనుకోకుండా కాక్‌పిట్ తలుపు లాక్ తెరుచుకోవడం వంటి వరస పరిణామాలు అందులో ప్రయాణిస్తున్న వారందరినీ దిగ్భ్రాంతిలో పడేశాయి. ఈమధ్యలోనే విమానం నియంత్రణ కోల్పోయి నిమిషంలోపే 34,000 అడుగుల ఎత్తునుంచి 17,000 అడుగులకు పడిపోవటంతో ప్రయాణికులంతా ప్రాణభయంతో కేకలు వేయటం వీడియోలో రికార్డయింది. మరో 2,000 అడుగుల కిందకు జారాక అది మళ్లీ క్రమేపీ గాల్లోకి లేవడం ఒకరకంగా అదృష్టమని చెప్పాలి. ప్రయాణికుల్లో కొందరు చొరవగా లోపలికెళ్లి జరిగిందేమిటో గ్రహించి కోపైలెట్‌ను అదుపు చేయటం, ప్రయాణికుల్లో ఒకరైన డెంటిస్టు రక్తస్రావం కాకుండా కెప్టెన్‌ను కాపాడటం ప్రశంసించ దగ్గ పనులు. ఇంకా ఆశ్చర్యకరమైన సంగతేమంటే... అనుకోకుండా ఆ విమానంలో రిలీఫ్ పైలెట్లు ఉండటం. అత్యవసర సమయంలో విమానం నడపాల్సిన కో పైలెటే నేరగాడు కావటం, పైలెట్‌కు స్పృహ లేకుండా పోవడం వంటి పరిణామాల మధ్య ఆ రిలీఫ్ పైలెట్లు లేకుంటే ఏం జరిగివుండేదో ఊహించుకుంటేనే వణుకొస్తుంది. అమెరికాలో జరిగిన ఉగ్రదాడి తర్వాత పైలెట్ లేదా కో పైలెట్ కోరుకుంటే తప్ప కాక్‌పిట్ తలుపు తెరుచుకోకుండా విమానాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బయటినుంచి తెరిచే ప్రయత్నం దుర్లభమయ్యేంత పటిష్టంగా ఆ తలుపుంటుంది. హైజాక్ యత్నం, బెదిరింపులు వంటివి క్యాబిన్‌లో మాత్రమే జరుగుతాయనీ,కాక్‌పిట్ సురక్షితంగా ఉండేలా చూస్తే సరిపోతుందనీ ఈ సాంకేతికత తీసుకొచ్చారు. కానీ తాజా ఉదంతంలో ప్రమాదం క్యాబిన్‌లో కాకుండా, కాక్‌పిట్‌లోనే పొంచివుండటం గమనించదగ్గది. వీటి సంగతలావుంచి అసలు దుబాయ్‌లో కో పైలెట్ చాకుతో విధులకు ఎలా రాగలిగాడు? అంటే భద్రత విషయంలో మునుపటి అప్రమత్తత సన్నగిల్లిందన్నమాట! నిత్యం వేలాదిమంది ప్రయాణించే దుబాయ్ విమానాశ్రయంలో ఇలాంటి భద్రతాపరమైన లోపం చోటుచేసుకోవటం ఊహకందనిది. ప్రపంచం కక్షలు, కార్పణ్యాలతో భయానకంగా మారింది. ఇప్పుడు జరిగిన ఉదంతానికి పురిగొల్పిన పరిణామాలేమిటన్నది ఇంకా తెలియాల్సే వున్నా ఇజ్రాయెల్ గాజాలో సాగిస్తున్న మారణకాండకు ప్రతీకారంగా కో పైలెట్ ఆ దేశ పౌరులు అధికంగా వున్న విమానాన్ని కూల్చేయదల్చుకున్నాడన్న కథనాలు వెలువడుతున్నాయి. 'కంటికి కన్ను...' సిద్ధాంతం మనిషిని ఉన్మాదిగా మారుస్తుంది. సహేతుక పోరాటాలపై నీలినీడలు కమ్మేలా చేస్తుంది. ఒక ఉన్మాదానికి మరో ఉన్మాదం ఎప్పటికీ జవాబు కాదు.

ఉత్సాహంగా స్వచ్ఛ మారథాన్





- 22 రాష్ట్రాల నుంచి 10 వేల మంది పాల్గొనడం విజయవాడకు గర్వకారణం
- స్వచ్ఛత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం అవసరం
- స్వచ్ఛ మారథాన్‌ను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

విజయవాడ, మహానగర్

పరిశుభ్రమైన విజయవాడ, ఆరోగ్యవంతమైన సమాజం లక్ష్యంగా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛ మారథాన్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం ప్రారంభించారు. శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి నిర్వహించిన 5కే, 10కే రన్‌లలో దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి సుమారు 10 వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ స్వచ్ఛ మారథాన్ కేవలం పరుగు కార్యక్రమం కాదని, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక బాధ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. విజయవాడను స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, నగర పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం విజయవాడ ఉత్సవ్--2.0ను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, బొండా సిద్ధార్థ, ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్, పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు, హెచ్‌డీఎఫ్‌సీ స్టేట్ హెడ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

సెమీఫైనల్స్‌కు రంగం సిద్ధం





- సబ్‌జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్‌లో ఉత్కంఠభరితంగా క్వార్టర్‌ఫైనల్స్
- బాలికల విభాగంలో కర్ణాటక, ఉత్తరప్రదేశ్ విజయం
- బాలుర విభాగంలో ఉత్తరప్రదేశ్, హర్యానా సెమీఫైనల్స్‌కు అర్హత

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

నగరంలో జరుగుతున్న 51వ సబ్‌జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆరో రోజైన శుక్రవారం నాకౌట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మారిస్ స్టెల్లా ఇండోర్ కోర్టులో జరిగిన బాలికల క్వార్టర్‌ఫైనల్స్‌లో కర్ణాటక 62-49తో కేరళపై విజయం సాధించింది. కర్ణాటక తరఫున ఆరోషి ఆనంద్ 17 పాయింట్లు సాధించింది. మరో మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 68-57తో మధ్యప్రదేశ్‌ను ఓడించగా, తేజస్వి కర్వానా 21 పాయింట్లతో రాణించింది. బాలుర విభాగంలో ఉత్తరప్రదేశ్ 65-40తో కర్ణాటకపై విజయం సాధించింది. ఉత్తరప్రదేశ్ తరఫున శబ్ద్ కుమార్ 21 పాయింట్లు సాధించాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో హర్యానా 70-65తో ఢిల్లీపై విజయం సాధించింది. కేశవ్ కౌశిక్ 17 పాయింట్లతో హర్యానా విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు జరిగిన ప్రీ-క్వార్టర్‌ఫైనల్స్‌లో బాలికల విభాగంలో పశ్చిమ బెంగాల్ 57-51తో ఒడిశాపై, ఢిల్లీ 75-41తో పంజాబ్‌పై గెలిచాయి. బాలుర విభాగంలో మధ్యప్రదేశ్ 71-51తో కేరళను, ఛత్తీస్‌గఢ్ 74-14తో పంజాబ్‌ను ఓడించి క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరాయి. మిగిలిన క్వార్టర్‌ఫైనల్స్ ఫలితాల అనంతరం సెమీఫైనల్ పోరుకు రంగం సిద్ధం కానుంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- సామాజిక సేవలో పేపర్ మర్చంట్స్ భాగస్వామ్యం అభినందనీయం
- వ్యాపారంతో పాటు సామాజిక సేవలోనూ భాగస్వాములు కావాలి
- ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్

విజయవాడ, మహానగర్

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వప్రయోజనంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించాలని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. గాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో విజయవాడ గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవోస్ హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం



విద్యాసాగర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి విలువైన సేవ అందించాలని పిలుపునిచ్చారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, తలసేమియా వంటి సందర్భాల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలు అండగా నిలవాలని సూచించారు. గాంధీజీ సేవా స్ఫూర్తి, లాల్‌బహదూర్ శాస్త్రి కర్తవ్యనిష్ఠను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు, యువత, వ్యాపారవర్గాలు సామాజిక సేవలో చురుకుగా పాల్గొనాలని కోరారు. పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మఫత్‌లాల్ జైన్, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి ఇ. చిట్టిబాబు, వైస్ చైర్మన్ డా. వెలగా జోషి, ఏపీ ఎన్జీవోస్ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ సభ్యులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్‌లో ఏపీ బాలికల జట్టుకు స్వర్ణం

- కేరళపై విజయం.. జాతీయ ఛాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్
- బాలుర జట్టుకు నాలుగో స్థానం
- క్రీడాకారులను సత్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ, మహానగర్:

జాతీయ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు స్వర్ణ పతకం సాధించింది. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన 39వ సబ్‌జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఏపీ బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచింది. ఫైనల్‌లో బలమైన కేరళ జట్టును ఓడించి జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. బాలుర విభాగంలోనూ ఏపీ జట్టు అత్యుత్తమ ఆటతీరుతో నాలుగో స్థానాన్ని సాధించింది. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలికలు, బాలుర జట్టు క్రీడాకారులు, శిక్షకులను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులను అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు బుడ్డయ్య, క్రీడాకారులు, శిక్షకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలి

- అమరావతిలో 'ఫిలిం నగర్', 'ఎన్టీఆర్ స్టూడియోస్' ఏర్పాటు చేయాలి
- స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక రోడ్‌మ్యాప్ అవసరం
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ భరత్ భూషణ్‌ను సత్కరించిన 'మా-ఏపీ'



విజయవాడ, మహానగర్:

రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా సహకరించాలని 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (మా-ఏపీ--24 క్రాఫ్ట్స్ యూనియన్)' అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా కోరారు. ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎఫ్‌డీసీ) నూతన చైర్మన్ పి. భరత్ భూషణ్‌ను 'మా-ఏపీ' ప్రతినిధులు శుక్రవారం నగరంలోని ఏపీ ఎఫ్‌డీసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా దిలీప్ రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక రోడ్‌మ్యాప్ రూపొందించాలని కోరారు. రాజధాని అమరావతిలో హైదరాబాద్ తరహాలో 'ఫిలిం నగర్', తెలుగు సినీ పరిశ్రమకు సేవలందించిన మాజీ ముఖ్యమంత్రి, నటుడు నందమూరి తారక రామారావు పేరుతో 'ఎన్టీఆర్ స్టూడియోస్' ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అరకు, లంబసింగి, భవానీ ఐలాండ్, సూర్యలంక తదితర ప్రాంతాల్లో షూటింగ్‌లను ప్రోత్సహించాలని, ఏపీలో కనీసం 20 శాతం చిత్రీకరణలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల పర్యాటక రంగంతో పాటు స్థానిక కళాకారులు, సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. రాష్ట్రంలోని నటీనటులు, కళాకారులతో సమగ్ర డైరెక్టరీ రూపొందించి నిర్మాతలు, దర్శకులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సినీ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలు, షూటింగ్‌లకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 'మా-ఏపీ' కార్యవర్గ సభ్యులు, నిర్మాతలు, సినీ కళాకారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

గాంధీజీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నేతల ఘన నివాళి

విజయవాడ, మహానగర్



పశ్చిమ నియోజకవర్గంలోని నైజాం గేట్ సెంటర్‌లో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మైనారిటీ బాజీ బాబా ఆధ్వర్యంలో గాంధీజీకి శుక్రవారం ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాజీ బాబా మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం వంటి విలువలను గాంధీజీ జీవితాంతం ఆచరించి దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ నాయకత్వం ప్రజల్లో ఐక్యత, స్వాతంత్ర్య కాంక్షను బలపరిచిందని, అహింసా మార్గంలో ప్రజలను ఏకం చేసి ఉద్యమానికి అందించిన నాయకత్వం భారత చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న సమాజంలో పేదలు, బలహీన వర్గాలు, మైనారిటీలతో సహా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, హక్కులు, అవకాశాలు ఉండాలని ఆకాంక్షించారని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రజల జీవితాల్లో ఆచరణలోకి తీసుకురావడమే నిజమైన నివాళి అని, శాంతి, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేరంగుల రమణ, బత్తుల పాండు, భవాని, గోలగాని శ్రీనివాసరావు, పైడా శ్రీనివాసరావు, ఏనుగుల సునీల్, మజ్జి శీను, నజీరుద్దీన్, షేక్ అహ్మద్, అబ్దుల్ గని, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

మహానగర్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే

మహారాష్ట్ర రాజధాని ముంబయిలో శుక్రవారం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న సీజేపీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలోనే అభిజిత్ దీప్కే నేతృత్వంలోని సీజేపీ పిలుపు మేరకు ముంబయి శివాజీ పార్క్‌లో నిరసనకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సమాజ ప్రతినిధులు తరలివచ్చారు. ఈ ఆందోళనలో గాంధీ కుటుంబానికి చెందిన తుషార్ గాంధీ, ప్రముఖ బాలీవుడ్ నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, సంగీత దర్శకుడు విశాల్ దద్లానీ కూడా పాల్గొని మద్దతు తెలిపారు. రాజకీయ పార్టీలు శివసేన, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీలు కూడా నిరసనకు తమ మద్దతు ప్రకటించాయి. నిరసనకారుల్ని ఉద్దేశించి ప్రసంగించిన సీజేపీ నాయకుడు అభిజిత్ దీప్కే, నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అసమర్థంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు జరిగిన 2 నెలల వ్యవధిలోనే మరోసారి తాము నిరసన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. మరోవైపు సీఈసీ తప్పక రాజీనామా చేయాల్సిందేనని, నేర విచారణ ఎదుర్కోవాల్సిందేనని దాదర్‌లో జరిగిన నిరసనలో సీజేపీ నాయకుడు అజింక్యా శిందే డిమాండ్ చేశారు. ఇంకా దిల్లీ పోలీసులు మళ్లీ క్రూరంగా ప్రవర్తించారని, మారండి లేకపోతే తామే మారుస్తామని సీజేపీ నాయకుడు సొరవ్ దాస్ హెచ్చరించారు. అంతకుముందు అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో మధ్యాహ్నం 4 గంటలకు నిరసన చేపడతామని సీజేపీ ముందుగానే హెచ్చరించింది. పోలీసుల నుంచి అనుమతి లభించకపోయినప్పటికీ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చింది. నిరసన నేపథ్యంలో శివాజీ పార్క్ పరిసరాల్లో భారీగా పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. సమీపంలోని దాదర్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పెద్ద సంఖ్యలోనే యువత శివాజీ పార్క్ వద్ద నిరసన ప్రాంతానికి చేరుకుంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ త్రివర్ణ పతాకాలతో పాటు వివిధ ప్లకార్డులను ప్రదర్శించారు.



సర్‌పై సీజేపీ ఆరోపణలు

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. 2025 ఓటర్ల జాబితాను మార్చకుండా నిలిపివేయాలని కోరుతోంది. ఇటీవల ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి- సర్ ప్రక్రియు సంబంధించి కొన్ని నిర్ణయాలు, ఉత్తర్వులపై 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు జాతీయ మీడియా కథనం పేర్కొంది. ఈ నివేదికల ఆధారంగానే పలు ప్రతిపక్ష పార్టీలతో పాటుగా సీజేపీ కూడా సీఈసీ రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తోంది. అయితే మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండించింది. సర్ ప్రక్రియ సహా ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలన్నీ ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ ఏకగ్రీవంగానే తీసుకున్నవని స్పష్టం చేసింది.

సీజేపీ చేపట్టిన నిరసనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఎన్నికల సంఘం కమిషనర్లు ఇప్పటికే అన్ని అనుమానాలకు వివరణ ఇచ్చారని, ప్రతిపక్షాలు నకిలీ కథనాలు వ్యాప్తి చేస్తున్నాయని, దీనిని ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. మరోవైపు మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత ఆశిష్ షెలార్ కూడా సీజేపీ నిరసనలపై తీవ్ర స్థాయిలో విరు చుకుపడ్డారు. ఈ ఆందోళనలను రాజ్యాంగ విరుద్ధ చర్యగా అభివర్ణించారు. సర్ ప్రక్రియపై ఏమైనా అభ్యంత రాలు ఉన్న ట్లయితే న్యాయపరంగా, రాజ్యాంగ బద్ధంగా ఎదుర్కోవాలని, వీధుల్లోకి వచ్చి అరాచకం సృష్టించడం సరికాదన్నారు.

జెన్ నెక్ట్స్ ముంబయి కౌంటర్ ప్రొటెస్ట్

మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలకు వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబయి' పేరిట ఓ వర్గం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టింది. సీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని దిగజార్చేలా మాట్లాడుతున్నారని, రాజ్యాంగ పరిరక్షణ కోసమే తాము ఇక్కడ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నట్లు సదరు బృందం ప్రతినిధులు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే పోలీసులు పరిస్థితుల్ని నిశితంగా పరిశీలిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు

వర్షాకాలంలో కూడా సమ్మర్‌లా ఎండలు మండుతుండగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది! నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఉత్తర భారతంలో కొనసాగుతున్నా, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపింది. కేరళ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వరకు పలు ప్రాంతాల్లో అక్టోబర్ 7 వరకు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా కేరళ, మాహే ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అక్టోబర్ 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది.

తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్ర, రాయలసీమలో అక్టోబర్ 2 నుంచి వర్షాలతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఆ పరిస్థితి అక్టోబర్ 5 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణలోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై ఏర్పడుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాల విషయంలో మార్పులు కనిపించొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

తమిళనాడులో గాలుల వేగం

తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న కేరళ, లక్షద్వీప్, తమిళనాడు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తమిళనాడుతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమలోనూ వాతావరణం మారే అవకాశం ఉంది. వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ పరిస్థితులను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.



కర్ణాటకలోనూ వానలు

కోస్తా కర్ణాటకలో అక్టోబర్ 2న విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణ కర్ణాటకలో అక్టోబర్ 5న అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో బెంగళూరు సహా దక్షిణ కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణం మారొచ్చు. మహారాష్ట్రలోని కోంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ అక్టోబర్ 7 వరకు అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది.

ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాలు

దక్షిణాదితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ వర్షాల పరిస్థితి కొనసాగనుంది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 2న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని ఐఎండీ తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్ని చోట్ల భారీ వర్షం పడే అవకాశం ఉంది. ఒడిశా, బంగాల్, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవుల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడొచ్చు. బిహార్, జార్ఖండ్‌లో అక్టోబర్ 5 నుంచి 7 మధ్య అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడే అవకాశం ఉంది.

ఉత్తరాదిలో రుతుపవనాల వెనక్కి ప్రయాణం

అదే సమయంలో ఉత్తర భారతంలో నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతోంది. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్?ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు త్వరలో వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ రుతుపవనాల ప్రభావం తగ్గుతోంది. అలా ఉత్తర భారతంలో వానలు తగ్గి వాతావరణం పొడిగా మారుతున్నా, దక్షిణ భారతంలో మాత్రం అక్టోబర్ మొదటి వారం వరకు వర్షాల ప్రభావం కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులను గమనించాల్సి ఉంటుంది.

జాతిపితకు ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు జరిగాయి. దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు గాంధీ, శాస్త్రికి నివాళులర్పించారు. ఉదయం రాజ్‌ఘాట్‌కు చేరుకున్న వారు గాంధీజీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం విజయ్‌ఘాట్‌ను సందర్శించి లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. రాజ్‌ఘాట్‌లో నిర్వహించిన సర్వధర్మ ప్రార్థనలోనూ ప్రముఖులు పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు మహాత్మా గాంధీకి పుష్పాంజలి ఘటించారు. దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాంతి, అహింస మరింత అవసరం

గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్' వేదికగా సందేశాన్ని పంచుకున్నారు. మహాత్మా గాంధీ జీవితం, ఆదర్శాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో యుద్ధాలు, సంఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో గాంధీ శాంతి, అహింస సందేశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడిందని పేర్కొన్నారు. దేశ ప్రజల తరఫున గాంధీకి గౌరవపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. సహానుభూతి, సమ్మిళిత విధానాలకు ప్రాధాన్యతనిస్తూ 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా దేశం ముందుకు సాగుతోందన్నారు. ఈ లక్ష్యం అందరి సంక్షేమాన్ని కోరుకునే గాంధీ 'సర్వోదయ' స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని చెప్పారు. నైతిక ప్రవర్తన, క్రియాశీల భాగస్వామ్యంతో శక్తివంతమైన, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి నిబద్ధతను పునరుద్ఘాటించాలని పిలుపునిచ్చారు.

బాపూజీ జీవితం మార్గదర్శకం

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కూడా గాంధీకి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ జీవితం, సందేశం శాంతి, కరుణ, నిస్వార్థం, సేవాభావాలకు శాశ్వత దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. గాంధీ ఆశించిన విలువలకు కట్టుబడి, న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన, సమ్మిళిత సమాజ నిర్మాణానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ గాంధీకి నివాళులర్పిస్తూ 'ఎక్స్'లో సందేశం పంచుకున్నారు. బాపూజీ జీవితం మొత్తం సత్యం, అహింస, కరుణ, సేవలకు మార్గదర్శిగా నిలిచిందన్నారు. ఆయన సందేశాలు ప్రతి యుగంలో మానవాళికి మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. గాంధీ కాలాతీత సందేశం మనల్ని ఉత్తమ సమాజం, సమైక్య భారత్ వైపు నడిపిస్తూనే ఉండాలని అన్నారు. గాంధీ ఆలోచనలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రేరేపించాయని ప్రధాని పేర్కొన్నారు. మానవాళితో పాటు గాంధీ ఆలోచనల ప్రవాహం కొనసాగుతున్నంత కాలం అవి ఎప్పటికీ ప్రాసంగికంగానే ఉంటాయని అన్నారు. గాంధీజీ స్వదేశీ, ఖాదీకి ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తుచేస్తూ అక్టోబర్ 2న కనీసం ఒక ఖాదీ ఉత్పత్తిని కొనుగోలు చేసి 'ఇది స్వదేశీ' అని గర్వంగా చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

శాస్త్రి సేవలను గుర్తుచేసుకున్న ప్రధాని

లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు నివాళులర్పించారు. శాస్త్రి నిరాడంబరత, దేశం పట్ల అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మరో వీడియో సందేశంలో శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదాన్ని గుర్తుచేశారు. దేశ సైనికులు, రైతులకు ఆయన అందించిన స్ఫూర్తిని ప్రస్తావించారు. వినయపూర్వకమైన వ్యక్తిత్వం కలిగినప్పటికీ శాస్త్రి దృఢమైన నాయకుడని ప్రధాని పేర్కొన్నారు. దేశం పట్ల ఆయనకున్న నిస్వార్థ భక్తి, ప్రధాన మంత్రిగా తన స్వల్ప పదవీకాలంలో దేశానికి సేవలందించేందుకు దోహదపడిందన్నారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ విజయ్‌ఘాట్‌కు వెళ్లి శాస్త్రికి నివాళులర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా గాంధీజీకి నివాళులర్పించారు. సత్యం, అహింస, సామరస్యం, న్యాయం అనే గాంధీజీ సూత్రాలపై నిలబడటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు

గాంధీ జయంతిని పురస్కరించుకుని దిల్లీలోని కర్తవ్య భవన్-1 సమీపంలో నిర్వహించిన శ్రమదాన్ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పాల్గొన్నారు. పరిసరాలను స్వయంగా పరిశుభ్రం చేశారు. గురుగ్రామ్‌లో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ 'స్వచ్ఛ భారత్ అభియాన్'లో పాల్గొని నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలో 'స్వచ్ఛతా హి సేవా'లో భాగంగా 'స్వచ్ఛథాన్ 2026' నిర్వహించారు. ఒడిశాలోని పూరీలో పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ శాండ్ ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇసుక యానిమేషన్ రూపొందించారు. ఈ కళాకృతిని సిద్ధం చేయడానికి సుమారు 30 నిమిషాలు పట్టిందని విద్యార్థులు తెలిపారు. జైపూర్‌లో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ గాంధీజీ, శాస్త్రికి నివాళులర్పించారు. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించారు. ఆయన జయంతిని భారత్‌లో గాంధీ జయంతిగా జరుపుకొంటారు. ఐక్యరాజ్యసమితి ఈ రోజును 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా గుర్తించింది. లాల్‌బహదూర్ శాస్త్రి 1904 అక్టోబర్ 2న ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొఘల్‌సరాయ్‌లో జన్మించారు. 1964 నుంచి 1966 వరకు భారత ప్రధానమంత్రిగా సేవలందించారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

మైలవరం, ఇబ్రహీంపట్నంలో 'డిమాండ్స్ డే' కార్యక్రమాలు

మీడియా కమిషన్, ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్

వేజ్ బోర్డు, ప్రమాద బీమా, హెల్త్ స్కీమ్ పునరుద్ధరించాలని విజ్ఞప్తి



మైలవరం, మహానగర్

వర్కింగ్ జర్నలిస్టులు, మీడియా ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం నాడు 'వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే' నిర్వహించారు. ఇందులో భాగంగా మైలవరం తహశీల్దార్ కార్యాలయంలో డీటీ బాణవత్ మోతియాకు, ఇబ్రహీంపట్నంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబుకు జర్నలిస్టుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. మీడియా రంగంలోని మార్పులను సమీక్షించేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకురావాలని, వర్కింగ్ జర్నలిస్టుల హక్కులను పునరుద్ధరించాలని కోరారు. ప్రస్తుత జీవన వ్యయాలకు అనుగుణంగా కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రింట్, బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియా ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బీమా, వర్కింగ్ జర్నలిస్ట్స్ హెల్త్ స్కీమ్, వెల్ఫేర్ ఫండ్‌ను పునరుద్ధరించాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, సీనియర్ పాత్రికేయులకు పింఛన్, 50 శాతం రైల్వే ప్రయాణ రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఏపీయూడబ్ల్యూజే జిల్లా, రాష్ట్ర ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు పాల్గొన్నారు.

సీఈసీని తొలగించాలంటూ

జంతర్ మంతర్ నిరసనలు

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆప్, యూత్ కాంగ్రెస్, పలు స్టూడెంట్ యూనియన్‌లు శుక్రవారం జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టాయి. 'సేవ్ డెమొక్రసీ' పేరుతో చేపట్టిన ఈ ఆందోళనలకు దిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ, యూత్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వెనక్కు తగ్గలేదు. దీనితో జంతర్ మంతర్ వద్దకు చేరుకున్న ఆప్ నేతలు ఆతిశీని, సౌరభ్ భరద్వాజ్‌ను, సుమారు 150 మంది ఆప్?, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనితో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా అక్రమంగా ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించారంటూ సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన సీఈసీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జంతర్ మంతర్ వద్ద యూత్ కాంగ్రెస్, ఆప్ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. దీనితో అనుమతి లేకుండా నిరసనలు చేస్తున్నారంటూ దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే సంజీవ్ ఝాలను దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు జంతర్ మంతర్ వద్దకు వెళ్లకుండా ఆప్ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌ను నార్త్ అవెన్యూ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ, తనను, ఝాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆప్ నేత భరద్వాజ్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. తమను అరెస్టు చేసినప్పటికీ, ఆందోళనలు కొనసాగించేందుకు, జంతర్ మంతర్ వద్దకు చేరుకోవాలని ఆప్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఆయన కోరారు. తమ నిరసనలకు అనుమతి లేదని పోలీసులు చెప్పారని, అయితే ప్రజాస్వామ్యంలో తన నిరసనలు చేయడానికి అనుమతి అవసరమా అని ఆయన ప్రశ్నించారు. "సుమారు వారం రోజుల క్రితమే తాము జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతి కోరుతూ పోలీసులకు లేఖ ఇచ్చాం. అయినప్పటికీ వారు అనుమతి ఇవ్వలేదు. అందుకే మా ఆందోళనలను వ్యక్తం చేయడానికి, మా ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటున్నాం" అని సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. జంతర్ మంతర్ సమీపంలోని పలు మెట్రో స్టేషన్లను మూసివేశారని, అందువల్ల ప్రజలు సమీపంలో తెరచి ఉన్న మెట్రో స్టేషన్లలో ప్రయాణించాలని, వీలైతే నిరసన ప్రదేశానికి నడిచి వెళ్లాలని ఆయన కోరారు.

ఇంటర్నెట్ సేవలు బంద్

ఆప్, విద్యార్థి సంఘాలు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ముందే ప్రకటించిన నేపథ్యంలో, శుక్రవారం పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా భద్రతను కట్టుదిట్టం చేశారు. దిల్లీలోని రాజీవ్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, జంతర్ మంతర్ సహా 12 స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను మూసివేశారు. అంతేకాదు జంతర్ మంతర్ పరిసరాల్లో ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు. జనపథ్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, బారాఖంబా, సేవ్ తీర్థ్, మండి హౌస్, లోక్ కల్యాణ్ మార్గ్, ఐఎస్ఏ, చాణ్రి బజార్, రామకృష్ణ ఆశ్రమ్ మార్గ్, దిల్లీ స్టేషన్లను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మూసివేస్తున్నట్లు డీఎంఆర్‌సీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. అయితే రాజీవ్‌చౌక్, మండి హౌస్, దిల్లీ, సెంట్రల్ సెక్రటేరియట్ స్టేషన్లలో ఇంటర్‌ఛేంజ్ సౌకర్యం ఉందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఆప్, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టాయి. అయితే ఈ నిరసనలకు ముందుగా పోలీసులు అనుమతి నిరాకరించారు. సున్నితమైన ప్రదేశాల్లో కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. రాకపోకలను నియంత్రించడానికి, అనధికారిక సమావేశాలను నిరోధించడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ప్రపంచానికి భారత ఆధ్యాత్మిక

జ్ఞానం పరిష్కారం చూపుతుంది: మోహన్ భగవత్

భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యా త్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, "మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి" అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది" అని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు.

బిజినెస్

విద్యుత్ వాహన విక్రయాల్లో మహీంద్రా కీలక మైలురాయి.. అమ్మకాలు లక్ష దాటేశాయ్!



ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో మహీంద్రా అండ్ మహీంద్రా కీలక మైలురాయిని అందుకుంది. కంపెనీ బోర్న్ ఎలక్ట్రిక్ (బీఈ) శ్రేణి ఎస్‌యూవీల అమ్మకాలు లక్ష యూనిట్లు దాటాయి. కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ విషయాన్ని 'ఎక్స్'లో వెల్లడించారు. మొదటి ఈవీ ఎస్‌యూవీలైన బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ బుకింగ్స్‌ను 2025 ఫిబ్రవరిలో ప్రారంభించిన తర్వాత రెండేళ్లు కూడా పూర్తికాకముందే ఈ స్థాయికి చేరడం విశేషం. బుకింగ్స్ తొలిరోజే మహీంద్రాకు 30,179 రిజర్వేషన్లు వచ్చాయి. వీటిన్నంటి ఎక్స్‌షోరూమ్ విలువ రూ.8,472 కోట్లుగా ఉంది. ఇందులో ఎక్స్ఈవీ 9ఈ వాటా 56 శాతం. అలాగే 73 శాతం మంది కస్టమర్లు టాప్ వేరియంట్ ప్యాక్ త్రీని ఎంచుకున్నారు. 2025 మార్చి 20న కస్టమర్ డెలివరీలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 9 నాటికి 3,000కుపైగా వాహనాలను అందించారు. నవంబర్ 2025 నాటికి బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ ఎస్‌యూవీలు 30 వేలకుపైగా భారత రోడ్లపైకి వచ్చాయి. అదే సమయంలో మరింత అందుబాటు ధరలో ఎక్స్ఈవీ 9ఎస్‌ను తీసుకొచ్చారు. దీని డెలివరీలు 2026 జనవరిలో ప్రారంభమయ్యాయి. 2026 ఏప్రిల్ చివరి నాటికి బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ, ఎక్స్ఈవీ 9ఎస్ కలిపి 65,615 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఇందులో ఎక్స్ఈవీ 9ఈ 34,369 యూనిట్లతో ముందుంది. బీఈ 6 20,108 యూనిట్లు, ఎక్స్ఈవీ 9ఎస్ 11,138 యూనిట్ల అమ్మకాలు సాధించాయి. ఆ తర్వాత కూడా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలకు డిమాండ్ కొనసాగింది. 2026 ఆగస్టులో ఎక్స్ఈవీ 9ఎస్ విక్రయాలు 4,508 యూనిట్లకు చేరాయి. ఈవీ అమ్మకాల జోరుతో మహీంద్రా మొత్తం ఎస్‌యూవీ విక్రయాలు కూడా పెరిగాయి. 2026 సెప్టెంబర్‌లో కంపెనీ మొత్తం ఆటో అమ్మకాలు 1,14,874 యూనిట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 15 శాతం వృద్ధి నమోదైంది. దేశీయ ఎస్‌యూవీ అమ్మకాలు 64,092 యూనిట్లకు చేరి 14 శాతం పెరిగాయి. జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 1,83,397 యూనిట్లకు చేరి 26 శాతం వృద్ధి సాధించాయి.

తయారీ రంగం పరుగులు..

7 నెలల గరిష్టానికి పీఎంఐ

కొత్త ఆర్డర్లు రావడం దేశీయంగా సెప్టెంబర్‌లో తయారీ రంగంలో ఉత్సాహం నింపింది. దీంతో పరిశ్రమ వృద్ధి ఏడు నెలల గరిష్టానికి ఎగిసింది. ఇందుకు సంబంధించిన హెచ్‌ఎస్‌బీసీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 55.1కి చేరింది. ఆగస్టులో ఇది 52.8గా నమోదైంది. పీఎంఐ పరిభాషలో ఇండెక్స్ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. దేశీయంగా వినియోగానికి, ఎగుమతులకు డిమాండ్ పటిష్టంగా ఉండటం తయారీ రంగానికి బూస్ట్‌గా పని చేసింది. వ్యాపారాలపై ఆశాభావం నాలుగు నెలల గరిష్టానికి ఎగిసింది. ఆర్డర్లు, ఉత్పత్తి పెరగడంతో ఫ్యాక్టరీల్లో నియామకాలు కూడా జోరందుకున్నాయని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకానమిస్ట్ ప్రాంజల్ భండారీ తెలిపారు. ముడి వస్తువులు, విక్రయాల రేట్లు గణనీయంగా పెరిగినప్పటికీ గత చరిత్రతో పోలిస్తే ధరల పెరుగుదల నామమాత్రంగానే ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. అమ్మకాలు పెరుగుతాయనే అంచనాలతో కంపెనీలు ముడి వస్తువులను గణనీయంగా కొనుక్కుని, నిల్వలు పెంచుకున్నట్లు వివరించారు. ఎల్రక్టానిక్స్, ఫార్మా, టెక్స్‌టైల్స్ మొదలైన వాటికి నెలకొన్న డిమాండ్‌తో మొత్తం అమ్మకాలు ఫిబ్రవరి తర్వాత అత్యధిక స్థాయిలో భారీగా వృద్ధి నమోదు చేశాయి. బ్రెజిల్, యూరప్, యూఏఈ, అమెరికాలోని క్లయింట్ల నుంచి ఎగుమతుల ఆర్డర్లు కూడా పెరిగాయి.

మన స్టాక్ మార్కెట్‌తో 'బాండ్' బ్యాటింగ్..!



పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. క్రూడాయిల్ ధరలు.. గత కొంతకాలంగా దేశీయ స్టాక్ మార్కెట్‌లను కుదిపేస్తున్న అంశాలు. ఈ జాబితాలోకి కొత్తగా మరో అంశం చేరింది. అదే బాండ్ ఈల్డ్స్ అమెరికాలో బాండ్లపై పెరిగిన ప్రతిఫలాలు మన మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇంతకీ అమెరికాలో బాండ్ రాబడులు ఎందుకు పెరుగుతున్నాయ్? మనపై ప్రభావం ఎందుకు పడుతోంది? ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరల రూపంలో మన స్టాక్ మార్కెట్ సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇటీవల కాలంలో మాత్రం అమెరికాలో బాండ్లపై ప్రతిఫలాలు మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ ప్రభావంతో గడిచిన ఎనిమిది వారాల్లో సెన్సెక్స్ 6,590 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 2,149 పాయింట్లు క్షీణించింది. దాదాపు రూ.26 లక్షల కోట్ల మదుపర్ల సంపద (బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్) ఆవిరైంది. అమెరికాలో 10 ఏళ్ల ట్రెజరీ బాండ్లపై రాబడులు 2007 తర్వాత తొలిసారి 5.31 శాతానికి చేరడం, 30 ఏళ్ల బాండ్లపై రాబడులు 5.65 శాతానికి పెరగడం (2002 తర్వాత గరిష్ఠ స్థాయి) ఇందుకు నేపథ్యం.

ఎందుకు పెరుగుతున్నాయి?

ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో నిధులను సేకరించడానికి బాండ్లను జారీ చేస్తాయి. సులభంగా చెప్పాలంటే, బాండ్ అనేది ఒక హామీ పత్రం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోకుండా, నేరుగా ప్రజల నుంచి, పెట్టుబడిదారుల నుంచి అప్పు తీసుకోవడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. అమెరికా ప్రభుత్వం కూడా వివిధ కాల వ్యవధులతో బాండ్లను జారీ చేస్తుంటుంది. వీటిని యూఎస్ ట్రెజరీ బాండ్లు అంటారు. వీటిపై వచ్చే రాబడులను ఈల్డ్స్‌గా వ్యవహరిస్తారు. అయితే, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలు ఉన్నాయి. పెరుగుతోన్న చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా.. దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగించొచ్చన్న అంచనాలు బలంగా ఉండటంతో బాండ్ ఈల్డ్స్ పెరుగుతున్నాయి. దీనికితోడు అమెరికా ప్రభుత్వం భారీగా రుణాలు తీసుకుంటుండడం, టెక్ కంపెనీలు సైతం ఏఐపై పెట్టుబడుల కోసం మూలధనం సమీకరణ కోసం పోటీ పడుతుండడం వల్ల కూడా బాండ్లపై రాబడులు పెరుగుతున్నాయి.

మనపై ప్రభావం ఎందుకు?

బాండ్లపై రాబడులు పెరిగితే ఈక్విటీ మార్కెట్‌లు సాధారణంగా ఒత్తిడిని ఎదుర్కొంటాయి. బాండ్లపై రాబడులు తగ్గినప్పుడు నిధులు ఈక్విటీ మార్కెట్లలోకి వస్తాయి. ప్రస్తుతం మన మార్కెట్ల విషయంలో జరుగుతున్నది ఇదే. అమెరికా ప్రభుత్వ బాండ్లలో రాబడి ఆకర్షణీయంగా మారినప్పుడు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రిస్క్ ఎక్కువగా ఉండే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకుంటారు. వాటిని అమెరికాలో ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ వైపు మళ్లించే అవకాశం ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై మెరుగైన రాబడులు వచ్చినప్పుడు ఎలాగైతే మనం రిస్కు కలిగిన పెట్టుబడి సాధనాల జోలికి పోమో.. అదే తరహాలో అన్నమాట. పైగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణిస్తుండడంతో విదేశీ ఇన్వెస్టర్ల రాబడులు తగ్గుతాయి కాబట్టి వారు మార్కెట్లో అమ్మకాలకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే దేశీయంగా గత కొన్ని రోజులుగా ఎఫ్ఐఐలు పెద్దమొత్తంలో విక్రయాలకు దిగుతున్నారు. ఈ వారంలోనే రూ.34వేల కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు.

10 కోట్ల బ్యారెళ్ల చమురు విడుదల చేస్తాం! - జీ7 దేశాలు



అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలతో ప్రపంచ ఇంధన మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. దీంతో అమెరికాలో డీజిల్ ధర రికార్డు స్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో జీ7 దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇంధన మార్కెట్లను స్థిరీకరించే ప్రయత్నాల్లో భాగంగా 10 కోట్ల బ్యారెళ్ల చమురు, ఇంధన ఉత్పత్తులను విడుదల చేసేందుకు అంగీకరించాయి. డీజిల్ విడుదల తక్షణమే జరుగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వచ్చే 20 రోజుల్లోనే దీనిని విడుదల చేస్తామన్నారు. అయితే, 10 కోట్ల బ్యారెళ్ల చమురును నాలుగు నెలల వ్యవధిలో విడుదల చేయనున్నట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. అంతర్జాతీయ ఇంధన సంస్థ సమన్వయంతో ఈ చర్యలు తీసుకోనున్నట్లు జీ7 దేశాలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.

ఇంధన విక్రయాలపై పరిమితులు వద్దు

ప్రైవేటు రిటెయిలర్లకు సూచించనున్న కేంద్రం



దిల్లీ: పెట్రోలు లేదా డీజిల్ విక్రయాలపై పరిమితులు పెట్టరాదని ప్రైవేటు ఇంధన రిటెయిల్ సంస్థలకు ప్రభుత్వం సూచించనున్నట్లు చమురు కార్యదర్శి నీరజ్ మిత్తల్ పేర్కొన్నారు. జియో-బీపీ, నయారా ఎనర్జీ తమకు చెందిన కొన్ని అవుట్‌లెట్లలో ఇంధన కొనుగోళ్లపై పరిమితులు విధించడం ఇందుకు నేపథ్యం. బల్క్-రిటెయిల్ ధరల మధ్య అంతరం కారణంగా, తక్కువ ధరకు డీజిల్‌ను నిల్వ చేసుకోవడానికి పారిశ్రామిక వినియోగదార్లు పెట్రోలు బంకులకు చేరుకోవడంతో ఆయా సంస్థలు ఈ ఆంక్షలు విధించాయి. ఇంధన విక్రయాలపై పరిమితికి ఎవరినీ అనుమతించమని, అది ఆమోదయోగ్యం కాదని నీరజ్ తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిలో మార్పులేదన్నారు. రిటెయిల్ డీజిల్ - బల్క్ వినియోగదార్లకు విక్రయించే డీజిల్ ధర మధ్య అంతరం లీటరుకు రూ.50 వరకు ఉండడంతో పారిశ్రామిక వినియోగదార్లు పెట్రోల్ బంకుల్లో భారీ ఎత్తున కొనుగోళ్లు చేపట్టారు. దీంతో జియో-బీపీ రోజుకు ఒక వినియోగదారుకు 50 లీటర్లు పరిమితి పెట్టింది. నయారా తన బంకుల్లో 70-200 లీటర్ల పరిమితి విధించింది.

టీమిండియా కీలక మ్యాచ్‌లు రెండు 'గోల్డ్ మెడల్స్' వచ్చే ఛాన్స్



ఆసియా క్రీడల్లో శుక్రవారం భారత్‌కు అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. ఒకటి, రెండు కాదు ఏకంగా ఆరు స్వర్ణ పతకాలు వచ్చాయి. అయితే రేపటి ఈవెంట్స్‌లోనూ భారత్‌కు మరో రెండు పసిడి పతకాలు వచ్చే అవకాశం ఉంది. పురుషుల క్రికెట్, పురుషుల హాకీ జట్లు గోల్డ్ మెడల్‌కు ఒక్క దూరంలో ఉన్నాయి. ఈ విభాగాల ఫైనల్స్‌లో మన అథ్లెట్లు పోటీపడాల్సి ఉంది. ఈ క్రమంలో భారత్‌కు ఛాన్స్?లు ఎలా ఉన్నాయో చూద్దాం!

గోల్డ్ నిలబెట్టుకోవాలని!

భారత క్రికెట్ జట్టు ఈ ఆసియా క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్?గా బరిలోకి దిగింది. అందుకు తగ్గట్లే రాణిస్తూ ఫైనల్?కు చేరింది. ఇక ఫైనల్?లో పాకిస్థాన్?ను ఢీ కొట్టనుండడం ఫ్యాన్స్?కు మరింత హై ఫీలింగ్ ఇస్తోంది. అయితే మన చిరకాల ప్రత్యర్థిని చిత్తు చేస్తూ ప్రతిష్ఠాత్మకమైన ఆసియా క్రీడల పసిడి పతకం అందుకోవడం కంటే భారత్?కు అద్భుతమై సందర్భం ఇంకోటి ఉండదు. దీంతో భారత్ మరోసారి ఛాంపియన్ ప్రదర్శన చేసి పాక్?ను ఓడించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అయితే మ్యాచ్?కు ఆతిథ్యమిస్తున్న నిషిన్ మైదానం అంచనాలకు అందకుండా ఉంది. ఈ మైదానంలో పరుగులు రాబట్టడం అంత సులువేం కాదని సెమీఫైనల్ మ్యాచ్ చూశాక అర్థమవుతోంది. అందుకే బ్యాటింగ్?లో టాపార్డర్? రాణించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అభిషేక్, తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్?పై ఆశలు ఉన్నాయి. ఇక ఈ పిచ్? స్పిన్నర్లకు ఎక్కువగా అనుకూలిస్తుంది. దీంతో ఫైనల్?లో స్పిన్నర్లది కీలక పాత్ర ఉండొచ్చు. ఈ లెక్కన భారత్ స్పిన్ విభాగంలో బలంగా ఉండడం కలిసొచ్చే అంశం. ఇక సెమీఫైనల్?లో దిగిన జట్టుతోనే భారత్ ఫైనల్?లో ఆడే అవకాశం ఉంది.

మరోవైపు ప్రత్యర్థి పాకిస్థాన్?ను తేలిగ్గా తీసిపారేయడానికి లేదు. ఎందుకంటే ఇప్పుడున్న జట్టులో చాలామంది కొత్తవాళ్లు ఉన్నారు. వాళ్లు ఎలా ఆడతారు? బలాబలాలేంటి? అనే విషయాలపై మనోళ్లకు అనుభవం తక్కువ. పైగా బౌలర్లు బ్రార్ అహ్మద్, సుఫియాన్ మోకిమ్, సైమ్ అయూబ్, అరాఫత్ రూపంలో నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ఆడితే పాక్?ను ఓడించడం భారత్?కు పెద్ద కష్టమేమీ కాదు.

హాకీ ఎప్పుడంటే?

ఈ క్రీడల్లో పురుషుల హాకీ జట్టు ఓటమి అనేది లేకుండా వరుస విజయాలతో దూసుకెళ్తోంది. అలా అజేయంగా ఫైనల్? దాకా వచ్చింది. ఇప్పుడు ఫైనల్?లో మలేసియాను ఢీ కొట్టనుంది. ఈ మ్యాచ్?లో విజయం సాధించేందుకు భారత్?కు విజయావకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. కెప్టెన్ హర్మన్?ప్రీత్ సింగ్, ఫార్వర్డ్ అభిషేక్, దిల్?ప్రీత్ సింగ్, మన్?ప్రీత్ సింగ్? టీమ్‌ఇండియాలో కీలక ప్లేయర్లు. అయితే మన ప్రత్యర్థి మలేసియా కూడా ఓటమి లేకుండా ఫైనల్?కు వచ్చింది. దీంతో ఆ జట్టును తేలిగ్గా తీసుకోకూడదు. మరి అటు క్రికెట్ అయినా, ఇటు హాకీ అయినా పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలో దిగి గోల్డ్ పట్టేయాలని ఆశిస్తూ, 'టీమ్‌ఇండియాకు ఆల్? ది బెస్ట్'.

క్రికెట్ మ్యాచ్? ఫైనల్- భారత్ ఇ పాకిస్థాన్ - మధ్యాహ్నం 1.30 గంటలకు
హాకీ మ్యాచ్ ఫైనల్- భారత్ ఇ మలేసియా- మధ్యాహ్నం 3.30 గంటలకు
ఈ రెండు జట్లు కూడా 2023 హంగ్జౌ ఆసియా క్రీడల్లో గోల్డ్ సాధించాయి. ఇప్పుడు మరోసారి పసిడి ముద్దాడాలని ఆశిస్తున్నాయి

స్పోర్ట్స్

44 ఏండ్ల స్వప్నం సాకారం

హాకీలో అమ్మాయిలకు స్వర్ణం

ఫైనల్లో చైనాకు చెక్.. ఒలింపిక్స్ బెర్త్ సొంతం


కాకమిగహరా (జపాన్):




భారత మహిళల హాకీ జట్టు తమ కలను నెరవేర్చుకుంది. నాలుగున్న దశబ్దాలుగా ఆసియాడ్‌లో అందని ద్రాక్షగా ఉన్న స్వర్ణ పతకాన్ని ఎట్టకేలకు అందుకుంది. చైనా అడ్డుగోడను దాటి ఆసియా చాంపియన్‌గా నిలిచి.. 2028 లాస్ ఎంజెల్స్ ఒలింపిక్స్ బెర్తు కూడా సొంతం చేసుకుంది. ఉత్కంఠభరిత ఫైనల్లో 1-0తో డిఫెండింగ్ చాంప్, పారిస్ ఒలింపిక్ రజత విజేత, అత్యంత బలమైన చైనాను ఓడించింది. 1982 తర్వాత ఆసియాడ్‌లో భారత మహిళల హాకీ జట్టుకు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. 10వ నిమిషంలో స్టార్ ఫార్వర్డ్ లాల్‌రెమ్‌సియామి విన్నింగ్ గోల్ కొట్టగా.. గోల్ కీపర్ బిచు దేవి ప్రత్యర్థికి అడ్డుగోడగా నిలిచి భారత్ పసిడి కలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషించింది. 1998, 2018 ఫైనల్స్‌లో రజతాలతో సరిపెట్టుకున్న భారత్, ఈసారి పసిడితో నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించింది. గత ఎడిషన్ సెమీస్‌లో 4-0తో తమను ఓడించిన చైనాపై ప్రతీకారం తీర్చుకుంది. ట్రాఫిక్ జామ్ కారణంగా టీమ్ బస్సులు ఆలస్యంగా స్టేడియానికి చేరుకోవడంతో మ్యాచ్ గంట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ భారత జట్టు ఏమాత్రం ఏకాగ్రత కోల్పోలేదు. ఆట ప్రారంభంలోనే మన ప్లేయర్లు చైనా డిఫెన్స్‌పై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో 10వ నిమిషంలో సాక్షి రాణా అందించిన పాస్‌ను అందుకున్న ఫార్వర్డ్ లాల్‌రెమ్‌సియామి అద్భుతమైన రివర్స్ స్టిక్ షాట్‌తో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించింది. ఆరంభంలోనే గోల్ సాధించడంతో భారత జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించింది. అనంతరం చైనా వరుస దాడులతో విరుచుకుపడింది. అయితే గోల్‌కీపర్ బిచు దేవి అసాధారణ ప్రదర్శనతో చైనా యత్నాలను తిప్పికొట్టింది. 18వ నిమిషంలో చైనాకు లభించిన తొలి పెనాల్టీ కార్నర్‌ను భారత్ నిలువరించింది. ఇక, మ్యాచ్ 24వ నిమిషంలో ప్రత్యర్థికి పెనాల్టీ స్ట్రోక్ దక్కడంతో కోచ్ షోర్డ్ మరీన్ బిచు దేవిని బరిలోకి దింపాడు. అతని నమ్మకాన్ని నిలబెట్టిన బిచు దేవి ఎడమవైపుకి డైవ్ చేస్తూ చైనీస్ స్ట్రోక్‌ను అద్భుతంగా అడ్డుకుంది. ఈ సేవ్ మ్యాచ్‌కే ప్రధాన మలుపుగా నిలిచింది. కెప్టెన్ సలీమా టెటే, నవనీత్ కౌర్, సుశీలా చాను, ఈషికా చౌదరి, శిల్పితో కూడిన భారత డిఫెన్స్ ప్రాణం పెట్టి పోరాడి చైనా ఫార్వర్డ్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఓ షాట్‌ను నిలువరించే క్రమంలో కెప్టెన్ సలీమా గాయపడినా వెరవకుండా పోరాడింది. ఆఖరి ఐదు నిమిషాల్లో చైనా తమ గోల్ కీపర్‌ను కూడా వెనక్కి పిలిపించి 11 మందితో దాడి చేసినప్పటికీ భారత రక్షణ విభాగాన్ని ఛేదించలేకపోయింది.

హాలీవుడ్ రేంజ్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'.. గూస్‌బంప్స్ తెప్పించే మూడు యాక్షన్ బ్లాక్స్!

టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'డ్రాగన్'. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ప్రశాంత్ నీల్ సినిమాలంటేనే విజువల్ వండర్స్, ఎమోషనల్ డెప్త్ మరియు గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ ఎపిసోడ్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. అయితే ఈసారి 'డ్రాగన్' కోసం నీల్ ఆ అంచనాలకు మించి రెట్టింపు స్థాయిలో యాక్షన్ ప్లాన్ చేసినట్లు సమాచారం. కేవలం సాధారణ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లా కాకుండా, హాలీవుడ్ స్థాయి సాంకేతిక విలువలతో విజువల్ విందుగా ఈ చిత్రాన్ని మలచడానికి చిత్ర యూనిట్ చాలా శ్రమిస్తోంది. ముఖ్యంగా సినిమాలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ ఈ చిత్రానికి ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. ప్రతి ఫైట్ సీక్వెన్స్‌కు బలమైన భావోద్వేగ నేపథ్యం ఉండేలా ప్రశాంత్ నీల్ ఈ సన్నివేశాలను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. సినిమా ప్రారంభంలో వచ్చే జైల్ ఫైట్ గురించి ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తోంది. అత్యంత క్లిష్టమైన సెట్టింగుల మధ్య, భారీ హంగులతో తెరకెక్కించిన ఈ సీక్వెన్స్ ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కట్టిపడేయడం ఖాయమని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక చిత్రంలోనే అత్యంత శక్తివంతమైన ఎపిసోడ్‌గా కాళీమాత ప్రాంగణం ఫైట్ నిలవబోతోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ సృష్టించిన మ్యాజిక్ ఈ ఫైట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లనున్నాయి. కాళీమాత ప్రాంగణం నేపథ్యంలో వచ్చే ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ మాస్ అండ్ రౌద్ర రూపం థియేటర్లలో ప్రేక్షకులకు పూనకాలు తెప్పించడం పక్కా. అలాగే ఈ మూడు యాక్షన్ బ్లాక్స్‌లో అత్యంత క్రూరమైన మరియు భావోద్వేగంతో కూడిన బ్లడ్ ఫైట్ ఎపిసోడ్ సినిమాకే అసలైన హైలైట్‌గా నిలవబోతున్నట్లు సమాచారం. ఇది సాధారణ పోరాటంలా కాకుండా ఒక సర్వైవల్ వార్ లా సాగుతుంది. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో రక్తపుటేరులు పారేలా, ప్రతి ఫ్రేమ్‌లోనూ ఇంటెన్సిటీ మిస్ కాకుండా దీన్ని రూపొందించారు. ఈ మూడు భారీ యాక్షన్ బ్లాక్‌లు సినిమా రన్టైమ్‌లో కీలక మలుపులుగా నిలుస్తూ, కథను పరుగులు పెట్టించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని సమాచారం. వెండితెరపై ఈ విజువల్ వండర్‌ను చూస్తున్నప్పుడు ప్రేక్షకులు మైమరచిపోవడం ఖాయమనే మాట బాక్సాఫీస్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది.





బాక్సాఫీస్ వద్ద దసరా పోరు.. 'ది ప్యారడైజ్' బాటలో 'రణబాలి'!

సినిమా రంగంలో బాక్సాఫీస్ లెక్కలు ఎప్పుడూ మారుతాయన్న సంగతి తెలిసిందే. ఒక సినిమా సాధించిన విజయాలు లేదా రికార్డులు తదుపరి సినిమాలకు ఒక బెంచ్‌మార్క్‌గా మారుతుంటాయి. తాజాగా నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన 'ది ప్యారడైజ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌లను నమోదు చేసి సంచలనం సృష్టించింది. ఈ సినిమాకు ఒక వైపు నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, కేవలం నాలుగు రోజుల్లోనే ఈ సినిమా రూ. 155 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు యూనిట్ వర్గాలు వెల్లడించాయి. ఇక నాని కెరీర్‌లో ఇటువంటి భారీ వసూళ్లు సాధించడం ఆయన స్టార్‌డమ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లినట్లు ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అదే బాక్సాఫీస్ సెంటిమెంట్‌ను రిపీట్ చేయడానికి టాలీవుడ్ మరో భారీ చిత్రంతో సిద్ధమవుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రణబాలి'. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో, ఆ కాలంలోని కరువు పరిస్థితుల సృష్టితో పాటు ఒక సరికొత్త ఆత్మకథాత్మక లేదా మిస్టరీ అంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం అత్యంత భారీ ఎత్తున విడుదలకు ముస్తాబవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్లు, డాక్యుమెంటరీ సిరీస్ వీడియోలు మరియు పోస్టర్లు ఈ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. 'ది ప్యారడైజ్' సినిమాకు ఏ విధంగానైతే బలమైన పాజిటివ్ బజ్ క్రియేట్ అయిందో, 'రణబాలి' విషయంలోనూ మేకర్స్ అదే వ్యూహంతో విజయవంతమయ్యారు. ఈ చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ గత చిత్రాలైన 'టాక్సీవాలా', 'శ్యామ్ సింగరాయ్' విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించాయి. ఆయన నుంచి వస్తున్న మరో పీరియాడికల్ డ్రామాపై భారీ అంచనాలు ఉండటంలో ఆశ్చర్యం లేదు. మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట తెరపై కనిపించనుండటం, ముఖ్యంగా వీరిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి 'యూ/ఏ' (ఖ/ూ) సర్టిఫికెట్ లభిస్తే, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా పెద్ద ఎత్తున థియేటర్లకు క్యూ కట్టే అవకాశం ఉంది. దసరా సెలవుల జోరుతో 'రణబాలి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి. ఇక త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌తో ప్రస్తుత హైప్ మరింత రెట్టింపు కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎదురుచూపులకు తెర.. 'హనుమాన్ అంశ' తెలుగు రిలీజ్ డేట్ ఫిక్స్!



కేవలం రూ. 1.8 కోట్ల చిన్న బడ్జెట్‌తో తెరకెక్కి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్రం 'హనుమాన్ అంశ'. ఈ సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అనౌన్స్‌మెంట్ అయితే చేశారు కానీ ఇప్పటివరకు ఎటువంటి అప్‌డేట్ లేదు. అయితే తాజాగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్ ఈ చిత్రాన్ని తెలుగులో అక్టోబర్ 9న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18నే విడుదల కావాల్సి ఉంది. అయితే త్రివిక్రమ్ శ్రీనాథ్ తన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్ ద్వారా ఈ రిలీజ్ నుండి తప్పుకోవడం, హైదరాబాద్‌లో జరగాల్సిన తెలుగు టీజర్ లాంచ్ ఈవెంట్ రద్దు కావడంతో ఈ సినిమా తెలుగు విడుదల కొద్ది రోజులు వాయిదా పడింది. తాజాగా హోంబలే ఫిలింస్ రంగంలోకి దిగి తెలుగు రిలీజ్ బాధ్యతలను తీసుకుంది. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా ఆధ్యాత్మిక డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం, ఇప్పటికే రూ. 400 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. శోభినావ్ సత్య నేమ్ కరోలి బాబా పాత్రలో నటించిన ఈ డివైన్ డ్రామా అక్టోబర్ 9న తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

మోహన్‌లాల్‌తో నటించడం ఆశీర్వాదం.. భాగ్యశ్రీ బోర్సే ఎమోషనల్ పోస్ట్ వైరల్



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి భాగ్యశ్రీ బోర్సే ఇప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఆపరేషన్ గంగా' సినిమాతో ఆమె మాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. తాజాగా మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన భాగ్యశ్రీ.. ఆయనతో కలిసి పనిచేస్తున్న అనుభవాన్ని వివరిస్తూ రాసిన మాటలు ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మోహన్‌లాల్‌తో కలిసి నటించడం తనకు ఆశీర్వాదంగా భావిస్తున్నానని భాగ్యశ్రీ పేర్కొన్నారు. షూటింగ్‌లో ప్రతి రోజూ ఆయన నుంచి ఎంతో నేర్చుకుంటున్నానని, ఆయన చూపు ద్వారా సినిమాను మరో కోణంలో చూడగలుగుతున్నానని తెలిపారు. మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఫొటోను పంచుకున్న భాగ్యశ్రీ.. ఆయనపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. మోహన్‌లాల్‌కు సహనటిగా ఉండటం తనకు ఒక ఆశీర్వాదంలా అనిపిస్తోందని తెలిపారు.ప్రతి రోజు షూటింగ్‌లో ఆయనను చూస్తూ సినిమాను ఎలా చూడాలో నేర్చుకుంటున్నానని, ఆయనలో ఉన్న ప్రతిభ నిజంగా అద్భుతమని ప్రశంసించారు. ఒక సీనియర్ నటుడితో కలిసి పనిచేసే అవకాశం రావడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని ఆమె పేర్కొన్నారు. భాగ్యశ్రీ చేసిన ఈ పోస్టు మోహన్‌లాల్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. కొత్త నటి తన సహనటుడైన మోహన్‌లాల్ గురించి ఇంత ఆప్యాయంగా, గౌరవంగా మాట్లాడటంపై అభిమానులు స్పందిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే 'ఆపరేషన్ గంగా' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంలో ఆమె మోహన్‌లాల్‌తో కలిసి నటిస్తున్నారు. తెలుగులో ఇప్పటికే సినిమాలు చేసిన భాగ్యశ్రీకి ఈ చిత్రం మరో ముఖ్యమైన అవకాశం అని చెప్పొచ్చు. విష్ణు మోహన్ దర్శకత్వం వహిస్తున్న 'ఆపరేషన్ గంగా' సినిమాకు సంబంధించిన జార్జియా షెడ్యూల్ తాజాగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో మోహన్‌లాల్, భాగ్యశ్రీ బోర్సేతో పాటు బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కూడా షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. ఈ సినిమా 2022లో రష్యా--ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేపట్టిన తరలింపు కార్యక్రమం నేపథ్యంలో తెరకెక్కుతోంది.ఆ సమయంలో వేలాది మంది భారతీయులు ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయారు. వారిని సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి చేపట్టిన భారీ తరలింపు చర్యలే ఈ సినిమాకు ప్రధాన నేపథ్యంగా నిలవనున్నాయి.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999